# విధురజీవి మాత్సర్యం

(కథానిక)

"ఏమా అక్క పుట్టినరోజుకదూ యివాళ? చూశావా ఏంబహుమతీ తెచ్చానో!" అంటూ చాలా సరదాగా నవ్వుతూ వచ్చారు ఆయన. అక్కవున్న యీ రెండు నెలలలోనూ ఆయన నవ్వుముఖం యివాళే చూశాను. నాకు ఆశ్చర్యం వేసింది: అక్కకి ఆయన బహుమానం తెచ్చారంటే. అక్కని చూస్తేనే విసుక్కునీ, నన్ను పక్కకి పిలిచి ఎప్పుడు వెళ్ళిపోతుందని అడిగే ఆయన, యీరోజు యిలా అనడం వింతే.

"ఏదీ చూపెట్టండి." అన్నా ఆత్రంగా.

"అంత త్వరగా చూపెడతానేమిటి?-ముందు ఓ కప్పుకాఫీ, తర్వాత తినడానికేమైనా, ఆ తరవాత నువ్వొచ్చి పక్కని కూర్చుంటే- అప్పుడూ, తెలిసిందా?" అంటూ బట్టలు మార్చుకుందుకి పడగ్గదిలోకి వెళ్ళిపోయారు.

ఏంతెచ్చివుంటారో అని ఎన్నోవిధాల ఆలోచించి చూశాను. నాకేం తట్టలేదు. ఆయనే చెప్తారుకదా అని కాఫీ టిఫీనూ తయారు చేశాను.

"ఏం రాధా? ఏమిటో చెప్పుకో గలవూ?" ఆ కంఠస్వరంలో వ్యంగ్యం ధ్వనిస్తూంటే, బాధ అనిపించిందికాని, ఏంచెయ్యను? అక్కంటే ఆయన కంత హేళన.

"మీరే చెప్పురూ, నాకేం తెలియడంలేదు... అయినా ఇన్నేళ్ళువచ్చాక, దానికి పుట్టినరోజుకి బహుమతీ తేవడం ఏమిటీ... మీకు మరీ లోకువైందండీ అది" అంటూంటే, ఓచేత్తో నానోరు మూసి, రెండోచేత్తో టిఫిను తింటూ,

"అయితే ఫరవాలేదు. ఇదిగో చూడు బహుమానం" అంటూ ఓ కవరు నాఒళ్ళో పారేశారు. అది తీస్తుంటే నా చేతులు ఒణికాయి. ఎందుకో తెలియదు... కవరుతీసి చూస్తే, అందులో ఒక సెకండ్ క్లాస్ రైలు టిక్కెట్టూ, రెండు మీల్సు టిక్కెట్లు వున్నాయి. నా గుండె క్షణంపాటు కొట్టుకోడం మానేసింది.

"మీ ఉద్దేశ్యం ఏమిటీ?" అన్న మాటను నా ప్రయత్నం లేకుండానే అనేశాను.

"ఏంలేదు. ఆ టిక్కెట్టుతో రైలెక్కి, దారిలో ఆ రెండు టిక్కెట్లూపెట్టి తృప్తిగా భోజనంచేసి క్షేమంగా రెండోరోజు రాత్రికి ఆవిడగారి స్వగృహంచేరుతుంది. తెలిసిందా?" అని నా ముఖంకేసి చూస్తున్నారు. నా ముఖకవళికల మార్పులకేంగాని, కొన్నిక్షణాలతర్వాత నేనేమయ్యానో నాకేతెలియదు. "ఏంరాధా ఒంట్లోబాగులేదా?" అన్న ఆయన మాటలు వినిపించాయంతే...

తెలివివచ్చి చుట్టూ చూసేసరికి పడకగదిలో ఉన్నాను. "ఏమండీ?" అని పిలిస్తే అక్కవచ్చి నా నుదురుమీద చేయివేసింది. ఏమిటో తేళ్లూ, జెర్రెలూ పాకినట్టయి, "అక్కా ఆయన్నొకసారి పిలూ" అని అడిగాను. ఇంతట్లో ఆయనేవచ్చారు.

"మీ ఆయన ఉత్తి మోటవాడని ఎన్నిసార్లు చెప్పలేదే! అయినా మనిషి ఒంట్లో ఎలాగున్నదీ చూడకుండానే షాంకిగ్ న్యూస్ చెప్పడంఏమిటీ" అంటూ అక్క ఆ గదిలోంచి వెళ్ళిపోయింది. అవును ఆయినది మోటుతనమే. చెయ్యదలచుకున్నదీ, అనదలచుకున్నదీ... చేసేయడం, అనేయడమేకాని, వాటిఫలితం ప్రభావం ఎలా వుంటుందో ఆలోచించరు.

"ఏంరాధా పొద్దుట అన్నంతిన్నావా? మరి లేకుంటే అంత నీరసంగా అయిపోయావేం?" నాపక్కనే కూర్చుంటూ అడిగారు.

"తినకేం బాగానే తిన్నాను." ముక్తసరిగా సమాధానంచెప్పి వూరుకుందామనుకున్న నాకు దుఃఖంపొర్లివచ్చింది. ఆయన నన్ను ఓదార్చుదామని కొంచెం ప్రయత్నంచేసి, నాచేతిని తనచేతిలోకి తీసుకొని నిశ్శబ్దంగా కూర్చుండిపోయారు.

అంత దుఃఖంలోనుంచీ ఆయనని చూస్తే ఎంతో బాధ అనిపించింది. ఆయనకి ఈ ప్రపంచంలో నేనుతప్ప యింకెవరూ లేరు. నాకుమాత్రం యీ

కె. రామలక్ష్మి

అక్కవుంది. ఆయినకి నేనంటే ప్రాణం. నన్ను ఎక్కడికేనాపంపి ఒక్కరోజుకూడా వుండలేరు. అన్నీ నాకు తెలుసు...కాని మరి అక్క అంటే ఆయన కెందుకంత అసహ్యం? అదేంచేసిందనీ?

"అక్క యిక్కడవుండడం మీకిష్టంలేదా?" తెలిసీకూడా అడిగాను.

"నాకిష్టం లేకపోవడానికి కారణాలు లేవంటావా?" అనునయస్వరంతోటే అడిగారు ఆయన. తెలియకేం? తెలుసు. అయినా ఆయనంతట ఆయనే చెప్తే విందామని.

నాన్నగారు బతికున్నరోజుల్లో యీ పెళ్ళికి నేనొప్పుకున్నప్పుడే అక్కకి నామీద ప్రేమకంటే జాలి ఎక్కువయింది. నాన్నగారితో హోరాహోరీగా పోరాడింది-ఇలాంటి బ్రూట్‌కి నన్నివ్వడం ఏమిటని. ఎక్కడో రైల్వేలో పనిచేస్తున్నాడు, ఉత్తి మూడోరకం స్నేహితులతో తిరుగుతాడు, పేకాడతాడు... అన్నీ తెలిసీ, ఆయన ముఖం చూడగానే నేనా వివాహానికి ఒప్పుకున్నా. అక్క ఎదురుతిరిగి వద్దని చెప్పమంటే చెప్పనందుకు నామీద కోపగించి పెళ్ళయిన కొన్నేళ్లయినా నన్ను చూడ్డానికే రాలేదు...మళ్ళీ నేనూ అక్కా కలుసుకోడం నాన్నగారు పోయిన రోజులలోనే. అప్పటికి బాగా ఆస్తివుండడంచేత చుట్టాలూ పక్కాలూ చాలామందే వచ్చారు. ఆస్థికి హక్కుదారులం మేం యిద్దరమే. అప్పట్లో అక్క దిక్కులేనిదిగా కనిపించింది నాకు. ఆస్థిపంపకం అప్పుడే అక్కర లేదనీ, అక్క దాన్ని చూసుకోవచ్చుననీ అనుకున్నాను. అలాగే అన్నీ ముగించుకొని యింటికి తిరిగి వచ్చేశానుకూడా.

"ఏమిటి రాధా చాలా దీర్ఘంగా ఆలోచిస్తున్నావు? నీకు యిష్టంలేకుంటే చెప్పు - రెండు నెలలపాటు నేనే ఎక్కడికేనా వెళ్ళిపోతాను" అన్నారు. ఎప్పుడూ చిలిపిగా నవ్వే ఆయనకళ్ళు నీళ్ళతో నిండిపోయాయి. నాకళ్లూ అశ్రుపూరితాలయాయి. ఎందుకు? ఎందుకీ బాధంతా? ఒకరినొకరు అర్థంచేసుకోలేకనా? అర్థంచేసుకునీ ఒకళ్లనొకళ్ళు బాధపెట్టుకోవాలనా?

"మీరు సెలవుపెట్టి ఎక్కడికేనా వెళ్ళేమాటుంటే నన్నూతీసుకు వెళ్ళండి. ఇలాంటప్పుడే నన్ను వదలి వెళ్ళాలనుందా!" యీ మాటలాయన హృదయంలో ఏ మధురస్వరాలు పలికించాయో, నన్ను అమాంతంగా తన చేతుల్లోకి తీసుకున్నారు. 'చూడు రాధా నా హృదయాన్ని విప్పి నీకు యీ రోజు చెప్తాను. తర్వాత నీకెలా తోస్తే అలాచెయ్యి. నేనూ నీతోపాటే వుంటాను"...ఎక్కడో శూన్యంలోకి చూస్తూ, చెప్పారు...

"నేనంటేనే మీ అక్కకి అసహ్యం. దానికి కారణం ఆవిడ నాకంటె ఎక్కువ చదువుకున్నది కావచ్చు. నీకంటె అందకత్తె కావచ్చు. ఐతే మాత్రం? ఒకసారి మనిద్దరం సన్నిహితులం అయాక, ఆవిడెవరు మనమధ్య అగాధం లేవనెత్తడానికి? ఆరోజు చూశావా నా స్నేహితు లందరి ముందూ ఎలా అందో? 'పేకాటని ప్రేమించే నువ్వు రాధ నేం ప్రేమిస్తావు?' అంటుంది-ఆవిడకేం మతిపోయిందేం? స్నేహితులతో సరదాగా పేకాడినంతమాత్రాన నువ్వంటే నాకు అభిమానంలేదనేనా అర్థం?...ఇంకోరోజు ఏమైంది? ఏదో కోపంవచ్చి, ప్రాణం విసుగ్గా వుండి నిన్ను కొట్టాను-నిజమే. ఆవిడేదో నిన్ను ఉద్ధరించేద్దామని పొరుగువారింటికి తీసు కెళ్ళిపోయిందా రాత్రికి. కాని...నిన్నూ నన్నూ ఎవరు దూరంగా వుంచగలరు రాధా? ఆ సంగతి ఆవిడకి యిప్పటికైనా తెలుస్తే!...కొట్టిన కొద్దిక్షణాలకే నేనెంత బాధ పడ్డానో నీకెలా తెలుస్తుంది?... కాని నీకు తెలిసింది. అందుకే అంతరాత్రివేళ నే పిలవగానే వచ్చేశావు. కొట్టిన నా చేతుల్లోనే నిద్రపోయావు. పొద్దుటే మీ అక్క చూడు ఏమందో? నీకు పౌరుషం లేదంది. తనయితే అలా కొట్టినందుకు మరునాడే విడాకు లిచ్చివుండునంది. ఏమో నువ్వూ అలాగే చేసేదానివేమో, కాని నాలో నీకు నమ్మకంవుంది. అందుకే నన్ను క్షమించి నాతో వున్నావు. ఏం రాధా భార్యాభర్తలకి కొంచం మనస్పర్థలు వస్తే వస్తాయి. అంతమాత్రంచేత మధ్యవాళ్ళ మాటలు నమ్మి ఒకళ్ళనొకళ్ళు దూరం అవాలా? ఆవిడ దృష్టిలో నేనొక జంతువుని, జంతువుతో నువ్వు వుండడం తల్చుకుంటే ఆవిడ భరించలేదు. ఎలాగేనా నిన్ను ఆ యింటికి, తన యింటికి, తీసుకుపోయి

రక్షిద్దామని"...మాట్లాడుతున్న కొద్దీ ఆయనకళ్లు కోపంతో ఎర్రబడ్డాయి...ఆయన చెప్పిందంతా నిజమే-కాని...

"ఆ ఆస్తి అప్పుడే పంచుకుంటే అక్కడితో ఒదిలిపోయేది. నువ్వొట్టి పిచ్చిదానివి. అక్కంటే ప్రాణం. నేనలా ఉండకూడదనను కాని నీ శాంతి సౌఖ్యాలు చూసి అసూయపడే ఆవిడ తత్వం గ్రహించలేదు నువ్వు. నే గ్రహించాను. అందుకే ఆవిడకి నేనంటేనూ, నా కావిడంటేనూ లోకువ...ఒక్క సంగతి ఆలోచించు. ఆ యిల్లు కూడాఅమ్మేసిందనే నానమ్మకం. కావలిస్తే నువ్వే అడిగిచూడు" చివరి మాటలకి ఉలిక్కిపడ్డాను. అంత ద్రోహం చేస్తుందా. అనిపించింది. "యింకో వారం రోజులు ఆవిడ ఇక్కడ వుందంటే, మనిద్దరిమధ్య సాన్నిహిత్యం అనురాగం చెడుతుంది. ఇది యింకోరోజు కూడా నే భరించలేను రాధా. నీ కిష్టంవచ్చినట్లు చెయ్యి. కల్మషాత్ము లున్నచోటా, మనిద్దరిమధ్యా అనురాగం సడలిన తరువాతా, మనకి సంతానంకల్గితే! ఎవరి కుంటుంది దానిమీద ప్రేమా ఆదరణాను? యివన్నీ ఆలోచించుకో, కొంచం విశ్రాంతి తీసుకో బాగుంటుంది. నే అలా తిరిగివస్తాను" అంటూ నన్ను వదలి లేచపోయారు. ఆయన అప్పుడు వెళ్ళిపోతే యింక లేవలేనేమో అనిపించింది-ఆలోచించుకోవలసింది చాలావుంది మరి.

ఈ జీవితంలో పురుష సాంగత్యానికి నోచుకోని అక్కకి ఎందుకింత బాధ! తనమీద ఎంత ప్రేముంటేమటుకు ఆయనంటే ఎందుకు హేళన!

"అక్కా, అక్కా" అని కేకవేశాను "ఏం రాధా, మీ రొమాన్స్ అయిందా" అంటూ వచ్చింది. ఆమాట వినగానే నావెన్నెముక విరిగినట్లయింది.

"అలా అంటావేమిటే" అన్నాను కోపంగా.

"మరింకేంమనాలీ అతనంటే అలాపడిచస్తావు కనకే, అంత లోకువ. అంతేకాదు, నీ ఆరోగ్యం నీ అందం చెడ్డానికి అతనే కారణం!"

"నీ అందం శాశ్వతంగా వుంటుంది కదా! దానికేంగాని... వూళ్ళో యింటికి మరమ్మతు చేయిస్తే, ఓ నెల్లాళ్లు అక్కడ వుందాం. నువ్వ ముందు వెళ్ళి చేయిస్తావా?" సామాన్యంగానే అడుగుదామని నా ఉద్దేశం. ఏం చెప్తుందో అని ఆత్రంగా సమాధానంకోసం ఎదురుచూశాను. పది నిముషాలు అలాగే కూర్చుండిపోయింది.

"ఆ యిల్లు అమ్మేశాను. మనకి అంత పెద్ద యిల్లు దేనికి అని" అంది మెల్లిగా.

"మరి అది మనిద్దరిదీ కదూ?"

"నీకేం? మీ ఆయన వున్నాడు. సంపాదిస్తున్నాడు. ఆస్తి కక్కుర్తి నీ కెందుకే!"అంది.

"అంతమాత్రంచేత నాకు ద్రోహంచేస్తావా?"

"నీకు ద్రోహాని కేముందీ, ఆస్థి పంపకం వద్దన్నావుగా? దానికి అర్థం ఏమిటీ—నీకు ఆస్తి అక్కరలేదనేగా?"

"బాగుంది. నీ ఆస్తి నా కక్కరలేదు. నువ్వు మటుకు మళ్ళీ ఆ వూరే వెళ్లిపో. నన్ను హాయిగా బతకనీ" అని చేతులు జోడించాను.

వ్యంగ్యంగా నవ్వుతూ "మీఆయన్ని అమ్మేస్తానను కున్నా వేమిటి?ఆ జంతువు ఎవరిక్కావాలే."

"నోరుముయ్. ఎవరు జంతువో అందరికీ తెలుసు..."

"ఎందుకు రాధా అలా అరుస్తున్నావు?" అంటూ అందుకున్నారు. అప్పుడే లోపలికి వస్తున్న ఆయన. దుఃఖంతో నా గొంతు పూడిపోయింది... ఆయన బాహువులలో నన్ను నేను రక్షించుకున్నాక అనగలిగాను... "ఆ టిక్కెట్టు దానికిచ్చేయండి. టైముకాకుండా పెట్టె బేడా సర్దుకుంటుంది"

"మీ ఆయన డబ్బుతో నాకెందుకూ టిక్కెట్టూ... అది నేనే కొనుక్కుంటాను." అంటూ బొంగరంలాతిరిగి లోపలికివెళ్ళిపోయింది. నేనూ ఆయనా అలాగే కూర్చుండిపోయాం.

ఓ అరగంటకల్లా, పెట్టెలు పైనపెట్టి బండికి కేకవేసింది అక్క. అక్క అలా వెళ్లిపోతూంటే నాకెంతో ఏడుపొచ్చింది. జీవితంలో ఏ ఆనందానికీ, సౌఖ్యానికీ నోచుకోని అక్క అనంతలోకాల్లోకి వెళ్లిపోతూన్నట్లు అనిపించింది. కాని ఏంచేస్తాను?..స్వార్థం అనుకుందేమో నాది. కాని, నా సౌఖ్యాన్నీ నాభర్త సౌఖ్యాన్నీ కూడా కాదనేంత మనస్థయిర్యంలేదు నాకు. అందుకే అక్క అలా వెళ్ళిపోతూంటే చూస్తూ వూరుకున్నాను. ★